క్లుప్తంగా

మహిళా మండలి ఆధ్వర్యంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధి రంగపేట గ్రామ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వనిత శక్తి మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మన అమ్మకు మన సారె..మనసారా కార్యక్రమంలో భాగంగా మహిళలు అన్నపూర్ణ దేవికి ఒడి బియ్యం పోసి సారె సమర్పించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

ముధోల్: మండల కేంద్రంతోపాటు మండలంలోని కారేగామ్ గ్రామ నర్సరీలను మంగళవారం ఎంపీడీవో సురేశ్‌బాబు పరిశీలించారు. తొమ్మిదో విడత హరితహారంలో నాటేందుకు మొక్కలు సిద్ధం చేయడం తోపాటు నీటిని సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఏపీవో శిరీష, సిబ్బంది ఉన్నారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న రమేశ్

ముధోల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల భవనానికి ముధోల్‌కే చెందిన తాటివారి రమేశ్ రూ.21వేల విరాళం అందజేశారు. మంగళవారం నిర్వాహకులకు విరాళం అందించారు. కార్యక్రమంలో గణేశ్, సుదర్శన్, రవిపాండే, మానాజీ పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

కుంటాల: మహారాష్ట్రలోని అప్పారావుపేట్ వెళ్లే మార్గంలో మంగళవారం మండలకేంద్రంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏఎస్సై రాందాస్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు పాత నేరస్తులను గుర్తించేందుకు వేలిముద్రలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పలువురు సిబ్బంది సాదిక్, బిక్కు పాల్గొన్నారు.

పేదలకు 'లయన్స్' చేయూత



దుప్పట్లతో గ్రామస్తులు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ బద్దనపల్లి విజయ చేతుల మీదుగా 50 మంది పేదలకు రూ.15వేల విలువైన దుప్పట్లను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు తాండ్ర చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు స్టీఫెన్, జగ్గారావు, ఉపసర్పంచ్ సుగుణాకర్, క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, సంజీవరావు, వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

'దోపిడీ నుంచి రైతుల్ని కాపాడాలి'

సోన్: కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీ నుంచి రైతులను కాపాడాలని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో తప్ప, తాలు పేరిట క్వింటాల్‌కు 10 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని వాపోయారు. టార్పాలిన్లు లేకపోవడంతో మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిందని వాపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు, ఎన్‌ఫోర్స్ డీటీ ప్రవీణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మేక ప్రేమ్‌కుమార్, కిసాన్ మోర్చా అధ్యక్షులు గంగారెడ్డి, హరీశ్‌రెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని సన్మానిస్తున్న తహసీల్దార్

కుబీర్: మండలంలోని చాతా గ్రామానికి చెందిన మనీష అనే విద్యార్థిని ఇటీవల ఐదో తరగతిలో ప్రవేశం కోసం పరీక్ష రాయగా కాగజ్‌నగర్ గురుకులంలో సీటు సాధించింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి కులం, ఆదాయం, నివాస సర్టిఫికెట్ల కోసం వచ్చినప్పుడు తహసీల్దార్ విశ్వంబర్, సిబ్బంది.. మనీషను శాలువాతో సన్మానించారు.



పిచ్చిమొక్కలతో అధ్వానంగా వాకింగ్‌ట్రాక్



విరిగిన ఆట వస్తువులు



పక్కన పడేసిన రోలర్ గేటు

ఆహ్లాదం పంచని పార్కు

జిల్లాకేంద్రంలోని దివ్యనగర్ కాలనీ పార్క్‌లో ఆహ్లాదం కరువైంది. విరిగిన గేటు, పిచ్చిమొక్కలతో నిండిన వాకింగ్‌ట్రాక్, ఎండిన మొక్కలతో పార్కు అపరిశుభ్రంగా మారింది. దీంతో ఉదయం, సాయంత్రం సేద తీరేందుకు వస్తున్న పిల్లలు, పెద్దలు ఇబ్బంది పడుతున్నారు. నిర్వహణ సక్రమంగా లేక ఆట వస్తువులు పనికి రాకుండా తుప్పు పడుతున్నాయి. గేట్లు ఊడిపోవడంతో పందులు, ఇతర పశువులు లోనికి వచ్చి అసౌకర్యం కల్గిస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఉద్యానవనం బాగుచేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

– నిర్మల్‌ఖిల్లా

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఐఏయూవైఎస్‌ఏ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడారు. యువత కోసం నిరంత రం సేవలందిస్తున్న ఐఏయూవైఎస్‌ఏ(ఇంటర్నేషన ల్ ఓమోజాయ యంగ్ స్టార్ అసోసియేషన్)కు ధ న్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు తిరుమల రుషి, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం, కృష్ణ హుస్సేన్‌భాష తదితరులు పాల్గొన్నారు.

మూగజీవికి ప్రాణసంకటం..!

- యజమానుల నిర్లక్ష్యంతో రోడ్లపై పశువుల సంచారం
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ప్రాథమిక చికిత్స అందిస్తున్న పశువైద్య సిబ్బంది



కారు కింద పడి విలవిలలాడుతున్న దూడ

భైంసాటౌన్: పట్టణాల్లో కొందరు పశువుల యజమానుల నిర్లక్ష్యం వాటి పాలిట ప్రాణసంకటంగా మారుతోంది. పాడి పశువులను ఇష్టారీతిన వదిలేస్తుండడంతో అవి రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. రద్దీగా ఉండే రహదారులపై పశువులు తిరుగుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతోపాటు కొన్నిసార్లు మూగజీవాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. జిల్లా కేంద్రమైన నిర్మల్‌తో పాటు ఖానాపూర్, భైంసా పట్టణాల్లో ప్రధాన రోడ్లపై పశువులు ఎక్కువగా తిరుగుతున్నాయి. కూరగాయల వ్యాపారులు, పండ్ల వ్యాపారులు వేసే వ్యర్థాలు తింటూ రోడ్లపైనే తిరుగుతున్నాయి. వాహనాలు వేగంగా వచ్చే క్రమంలో మూగజీవాలు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతుండగా.. కొన్ని సందర్భాల్లో వాహనదారులు కింద పడుతున్నారు. మున్సిపల్ అధికారులు యజమానులకు అవగాహన కల్పించి రోడ్లపైకి మూగజీవాలు రాకుండా చూడాలని కోరుతున్నారు.

- భైంసాలో భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై బజాజ్ ఫ్యాక్టరీ సమీపంలో గతంలో ఐచర్ వాహనం వేగంగా ఆవును ఢీకొన్న ఘటనలో అది తీవ్రరక్తస్రావంతో మృతి చెందింది.
- తాజాగా మంగళవారం భైంసాలో బస్టాండ్ వెళ్లే మార్గంలో లేగదూడను కారు ఢీకొనడంతో కింద పడి విలవిలలాడింది. ఛాతి భాగంలో ఎముక విరగడంతో కూలబడిపోయింది. గమనించిన స్థానికులు కారు కింద నుంచి దూడను బయటికు తీసి పశువుల అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు వచ్చి వైద్యం అందించారు.

ఇలా మూగజీవాలు రోడ్లపైకి చేరి కొన్నిసార్లు గాయాల పాలవుతుండగా, మరికొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపైకి పశువులు రాకుండా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

భైంసాలో కొందరు యజమానులు పశువులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. యజమానులు పశువులను రోడ్లపైకి వదలకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

కార్మికుల సమస్యలపై సీఐటీయూ పోరాటం



జెండా ఆవిష్కరణలో నాయకులు

ఖానాపూర్: కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై సీఐటీయూ యూనియన్ రాజీలేని పోరాటం చేస్తోందని సీఐటీయూ అనుబంధ వీవోఏల సంఘం ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి బాదవత్ రవీందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన సీఐటీయూ 53వ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని జెండా ఆవిష్కరించారు. పోరాటాలతోనే హక్కులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయశీల, లావణ్య, నరేశ్, సురేశ్, స్వప్న, మమత, స్రవంతి, శైలజ, ప్రేమల, స్వామి తదితరులు ఉన్నారు.

పథకాలను ఇంటింటికీ వివరించాలి



తానూరులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తానూరు: కేంద్రంలో ప్రధాని మోదీ పాలన, పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ వివరించాలని బీజేపీ తాలూక అధ్యక్షుడు తాడేవార్ సాయినాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాలలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకోవడంతో కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో మే 30 నుంచి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ పేరిట పార్టీ సమావేశాలు, లబ్ధిదారుల సమ్మేళనం, అసెంబ్లీ స్థాయిలో బహిరంగ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శి శేషారావ్, గోపాల్‌స్వామి, రాందాస్ పటేల్, సరస్వతి, సంజీవ్‌రెడ్డి, పోశెట్టి, జ్ఞానేశ్వర్, భూమేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భైంసాటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట పండుగలు నిర్వహించాలంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. మోసపూరిత పథకాలతో ప్రజలు ఏ పండుగ చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు పవార్ రామారావుపటేల్ ప్రశ్నించారు. మహా సంపర్క్ కార్యక్రమంలో భాగంగా భైంసాలోని ఎస్ఎస్ కాటన్‌లో మంగళవారం భైంసా మండల కార్యకర్తల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య పిలుపునిచ్చారు. రావుల రాంనాథ్, పార్లమెంట్ కోకన్వీనర్ మయూరి చంద్ర, నారాయణ్‌రెడ్డి, రవిపాండే, దత్తు పాల్గొన్నారు.

కుంటాల: కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రతి గ్రామంలో బూత్ స్థాయి కమిటీలను నియమించాలన్నారు. బీజేపీ మండల కన్వీనర్ గుడ్డేటి నర్సయ్య, ఫుల్‌టైమ్ ఇన్‌చార్జి రాజశేఖర్, జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి తాటి శివ, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, ముక్తేష్, సాయినాథ్, శ్రీనివాస్, రాజన్న, సాయన్న తదితరులున్నారు.

ముధోల్: మండలంలోని బోరిగాంలో మంగళవారం ఇంటింటికీ బీజేపీ–గడగడపకు మోహన్‌రావుపటేల్ కార్యక్రమం నిర్వహించారు. మోహన్‌రావు పటేల్ గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు.

ఫోన్ అప్పగింత

ఖానాపూర్: నిర్మల్‌కు చెందిన కోడూరి సాయికృష్ణ నెలరోజుల కిందట ఖానాపూర్‌లో ఫోన్ పొగొట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా సదరు ఫోన్ ఆచూకీ తెలుసుకొని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఆర్.శంకర్ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రజలు ఫోన్ పోతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

'కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి'

నర్సాపూర్(జి): ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని పంచాయతీ కార్మికులు.. ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనంత విశ్వేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వారి వెంట పలువురు ఐఎఫ్‌టీయూ నాయకులు ఉన్నారు.

నూతన నియామకం

కడెం: కాంగ్రెస్ పార్టీ విశ్వకర్మ సంఘం అనుబంధ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన కొలిమికుంట సత్యంచారి నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ నాయకుడు సతీశ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

సన్మానం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం ఎంప్లాయిస్ యూనిస్ ఆధ్వర్యంలో సర్పంచ్ రాజన్నను సన్మానించారు. ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ రాజన్న, ఇటీవలే పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన చాకెటి లస్మన్నను శాలువాతో సత్కరించారు. గణపతి, దశరథ్, శ్రీనివాస్, సుభాశ్, సంజీవ్, జనార్ధన్ ఉన్నారు.

నామినేషన్‌కు నేడు తుది గడువు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి యోగేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ సహకార సంఘం ఎన్నికల నామినేషన్ దాఖలుకు గడువు బుధవారంతో ముగియనుందని ఆ సంఘం ఎన్నికల అధికారి మమత ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ చేసే వారు గడువులోగా రూ.750 రుసుం చెల్లించి నామినేషన్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. జూన్ 1న నామినేషన్ పరిశీలన, 2న నామినేషన్ ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులు ప్రకటిస్తామన్నారు. జూన్ 6న ఎన్నికలను పంచగుడి పంచాయతీ కార్యాలయంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు తర్వాత గెలుపొందిన వారి పేర్లు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నేడు ఉత్సవాలపై సమావేశం

లక్ష్మణచాంద: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు దశాబ్ది ఉత్సవాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

నిరుపయోగంగా సోలార్‌యంత్రం



తానూరు: మండలంలోని వర్ఝురి (బి) గ్రామంలో తాగునీరు అందించేందుకు ఆరేళ్ల కిందట నాబార్డ్ పథకం కింద బోరు మోటార్ వేసి సోలార్ యంత్రం ఏర్పాటు చేశారు. ఏడాది కిందట బోరు మోటార్ చెడిపోవడంతో సోలార్ యంత్రం నిరుపయోగంగా మారింది. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అధికా రులు బోరుమోటార్‌కు మరమ్మతులు చేసి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, ఎంపీడీవో, ఫోన్ 97019 82693

ఉపాధి పనులు పరిశీలన



రాచాపూర్‌లో పరిశీలిస్తున్న ఎంపీడీవో శేఖర్

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి (కే), వడ్యాల్ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో శేఖర్ పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు. అధికారుల కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. ఉదయం త్వరగా పనులకు వచ్చి ఎండలు తీవ్రతరం కాక ముందే ఇళ్లకు వెళ్లాలని సూచించారు. ఇంటికి వెళ్లాలని తిరిగి సాయంత్రం సమయంలో పనులు చేసుకోవాలని సూచించారు. వారి వెంట ఎఫ్ఏ జె.శ్రీనివాస్ ఉన్నారు.

కడెం: అర్హులందరూ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో జయదేవ్ అన్నారు. మంగళవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంట కోసం గోబర్ గ్యాస్ ట్యాంక్ నిర్మాణ పనులను సర్పంచ్ గంగన్న ప్రారంభించారు. గోబర్‌గ్యాస్‌తో వంట చేయడం ద్వారా సిలిండర్ గ్యాస్ ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీఏ గణేశ్, ఎఫ్ఏ కమలాకర్, కారోబార్ మహేందర్ తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



లక్ష్మణచాందలో విత్తనాలు అందిస్తున్న నేతలు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 కేజీల బ్యాగు రాయితీపై రూ.843కి అందిస్తున్నామని.. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌తో మండలకేంద్రంలోని పీఏసీఎస్, కనకాపూర్ ఆగ్రోస్‌లో సంప్రదించాలని కోరారు. ఇందులో జెడ్పీటీసీ రాజేశ్వర్, ఏవో ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, సర్పంచ్ గంగాధర్, ఏఈవోలు ఉమా మహేశ్వరి, సంతోశ్‌కుమార్, పవిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం రైతులకు పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. త్వరలో ఎరువులను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో సీఈవో చిన్నయ్య, ఏఈవో మౌనిక, భూమేశ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, భోజన్న, సుధీర్, ప్రశాంత్, లింగన్న ఉన్నారు.

రైతులకు సేఫ్టీ బూట్లు అందజేత



బూట్లు అందిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు

నిర్మల్‌రూరల్: మండలంలోని వెంగపేట్ గ్రామంలో మంగళవారం గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు సేఫ్టీ బూట్లను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. గట్ల వెంట నడిచేటప్పుడు పాములు, తేళ్లు కుట్టకుండా గాజుపెంకుల నుంచి రక్షణగా బూట్లు కాపాడతాయన్నారు. ఒక్కొక్కరికి రూ. 1800 విలువ చేసే బూట్లను జిల్లాలోని 20 మంది రైతులకు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు పంపిణీ చేశారు. అమెరికాలో ఉండి ఇక్కడి రైతుల శ్రేయస్సు కోసం పాటు పడుతున్నందుకు నిర్వాహకులు పల్లెల పన్నెల జనార్ధన్, పరస శ్రీనివాస్, నవీన్, రమణను వినోద్‌రావు అభినందించారు. కార్యక్రమంలో కిసాన్ స్ఫూర్తి ఫౌండేషన్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రెటరీ, జిల్లా నుంచి ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

'అవినీతి, అన్యాయానికి మంత్రి వత్తాసు'



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: అవినీతికి, అన్యాయానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వత్తాసు పలుకుతున్నారని కాంగ్రెస్ నాయకులు, సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్దకు ఇద్దరం కలిసి వెళ్దామని.. ఏ రైతైనా కిలో ఎక్కువ తూకం వేయలేదని చెబితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని పేర్కొన్నారు. నిరూపిస్తే అల్లోల తన మంత్రి పదవికి రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. జెడ్పీ సమావేశంలో రైతుల సమస్యలపై మాట్లాడుతుంటే మంత్రి తన మైక్ కట్ చేయించడం హాస్యాస్పదమన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడనీయకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కడం తగదని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అర్జుమాన్, అబ్దుల్, మతిన్, సాయన్న ,తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



వెండి కిరీటంతో ఆలయానికి వస్తున్న దాత

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ లో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు సదర్‌బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గౌడశెట్టి పూజారుల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. దిలావర్‌పూర్‌కే చెందిన గుగ్గిళ్ల వనిత–సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో తండ్రి భూమాగౌడ్ జ్ఞాపకార్థం అమ్మవారికి రూ.50 వేల విలువైన వెండి కిరీటం బహూకరించారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కరిపె లక్ష్మీబాయి(80) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు జాదవ్ సుమన్ పరామర్శించారు. కార్యక్రమంలో రాజన్న, అనసూర్య తదితరులు ఉన్నారు.